కూటమి కుట్రలకు బలైపోయాం

- విద్యార్థులకు అందని ఫీజు రీయింబర్స్‌మెంట్
- నిరుద్యోగికి ఉపాధి లేదు.. భృతి అసలే లేదు
- వైఎస్సార్‌సీపీ యువత విభాగం ఆధ్వర్యంలో యువతపోరు
- గళం విప్పిన యువత, నిరుద్యోగులు



కలెక్టరేట్ వద్ద నిర్వహిటూంంచిన యువత పోరులో నినాదాలు చేస్తున్న యువత, నిరుద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్/కార్పొరేషన్: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం మాయ మాటలు నమ్మి మోసపోయామని యువత, నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించడంపై వైఎస్సార్‌సీపీ యువజన విభాగం యువత పోరుకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న యువత, నిరుద్యోగులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. నాయకులు హేమంత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, మురళీ, చక్రి, స్టాంలీ, హర్ష, రెడ్డిసాయి, శశిదీప్, బాబీ, వివేక, కలేషా, తేజారెడ్డి, ప్రవీన్, వేణు, రూపేష్, సద్దాం, జయంతి, వినోద్, జస్టిన్, గౌతమ్, హరిషా, బిందు, కౌసర్, లత, కవిత పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచించిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను దారుణంగా మోసం చేసింది. నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. నిరుద్యోగులను మోసం చేయడమే పనిగా పెట్టుకుంది. హామీలు అమలు చేసే వరకూ పోరాటం ఆగదు.

- విష్ణురెడ్డి, విద్యార్థి విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు

ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకోలేదు



సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల ముందు వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచారు. అధికారంలో రావడానికి మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. తీరా వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు.

- శశిదీప్‌రెడ్డి, నగర మాజీ అధ్యక్షుడు, విద్యార్థి విభాగం

విద్యారంగం అస్తవ్యస్తం



కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక విద్యారంగం అస్తవ్యస్తంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పినా నాయకులు నేటి వరకు ఒక్క పైసా విడుదల చేయలేదు.

- సోను, పూతలపట్టు

విద్యార్థులకు ఆర్థిక కష్టాలు



రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. సెమిస్టర్ ఎగ్జామ్స్ రాయాలన్నా, సర్టిఫికెట్లు తీసుకోవాలన్నా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు అనేక ఆర్థిక కష్టాలకు గురవుతున్నారు.

- గౌతమ్, చిత్తూరు

ఉన్నత విద్య ప్రశ్నార్థకం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. యువగళం పాదయాత్రలో అన్నీ ఇవ్వగలం అని నమ్మించిన మంత్రి నారా లోకేష్ నేడు నోరుమెదపడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

- లతీష్, పలమనేరు

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణం చెల్లించాలి. దీంతో పాటు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో తీసుకురావాలి.

- గణేష్, జీడీనెల్లూరు

ఎక్స్‌ప్రెస్ హైవే మార్గాన్ని మార్చండి



చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

వి.కోట: మా భూములకు వెళ్లే దారిని ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు మూసివేశారని, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చినట్టు మండలంలోని తోట కనుమ గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని తోటకనుమ రెవెన్యూ పరిధిలోని దాదాపు 200 మంది రైతులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సమస్య నివేదించారు. తమ గ్రామం నుంచి ఎక్స్‌ప్రెస్ హైవేకు అవతల వైపు పోవడానికి రోడ్డు ఉందని, ఈ రోడ్డు వెంబడి పలు గ్రామాలవారు పొలాలకు వెళ్లడానికి ఉన్న రహదారిని మూసివేసి, ఎక్కడో దూరంగా ఉన్న రోడ్డు మార్గానికి మార్చారని తెలిపారు. గతంలోఉన్న రోడ్డు లేకుంటే తోటకనుమ పరిధిలోని చాలా మంది రైతులు, గ్రామస్తులు నష్టపోవాల్సి వస్తుందని, గతంలో ఉన్న రోడ్డు మార్గమే తమకు కావాలని విజ్ఞప్తి చేశారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి



స్కానింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతురావు

తవణంపల్లె: చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ (టీకాలు) అధికారి డాక్టర్ హనుమంతురావు వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో గర్భవతులను పరీక్షించే యంత్రాన్ని, ల్యాబ్‌ను, ఫార్మసీని, ఐఎల్ఆర్(ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్)ని తనిఖీ చేశారు. అనంతరం టీకాల కార్యక్రమంపై ఆరా తీసి సమీక్షించారు. పిల్లలకు క్రమం తప్పకుండా సకాలంలో టీకాలువ వేయించాలని సూచించారు. టీకాలు వేసిన వెంటనే లాన్‌లైన్‌లో నమోదు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ, ఆరోగ్యపర్యవేక్షకులు రాజశేఖర్, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఎల్‌టి శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికి రూ.15 గిట్టుబాటు ధర ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం కిలో మామిడికి రూ.15 గిట్టుబాటు ధర ఇవ్వాలని బీసీవై (భారత చైతన్య యువజన పార్టీ) రైతు విభాగం నాయకులు వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆ పార్టీ నాయకులు జేసీ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మామిడి రైతుల బాధలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మామిడి రైతులకు కిలో మామిడికి రూ.15 గిట్టుబాటు ధర ఇచ్చి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూజలు చేసి నివాళి అర్పించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ 1901లో బెంగాల్లో జన్మించిన ముఖర్జీ నెహ్రూ క్యాబినెట్లో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. కానీ అప్పటి ప్రభుత్వం కశ్మీర్‌ను భారతదేశం నుంచి విడగొట్టి ప్రత్యేక దేశంగా ప్రకటించడంతో దానిని తీవ్రంగా ముఖర్జీ ఖండించారన్నారు. భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేసి 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాటం చేశారన్నారు. 71 ఏళ్ల తర్వాత నరేంద్ర మోదీ 370 ఆర్టికల్‌ను రద్దుచేసి శ్యాంప్రసాద్ ముఖర్జీకి అంకితం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామభద్ర, గోకుల్, సత్య, వేణు, జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ అరుణమ్మ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రామాభివృద్ధికి మహిళా సర్పంచులు ప్రణాళిక బద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ(ఈఓపీఆర్డీ) అరుణమ్మ పేర్కొనారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాధికారతతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మహిళా సర్పంచులకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణకు బంగారుపాళ్యం, పులిచెర్లలోని మహిళా సర్పంచులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో జరిగే అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ఎంపిక చేయాలన్నారు. ఆ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులను పకడ్బందీగా పూర్తి చేస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎండీపీఓలు రమేష్‌బాబు,పంచాయతీ కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి మందులు, మాత్రలు అందజేశారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి దళితవాడకు చెందిన ఓ వివాహిత సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన మురళి అతని భార్య మైసూరకు మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు పడ్డారు. దీంతో మైసూర(27) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివాహిత ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టండి

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంట పంచాయతీలో ఇంటిపన్ను నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం జేసీ విద్యాధరికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ కార్యదర్శి పంచాయతీ పరిధిలో రూ 2.5 లక్షల వరకు ఇంటి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. అందులో లక్ష రూపాయలు ప్రభుత్వ ఖాతాలో జమచేసి మిగిలిన రూ.1.5 లక్షలు స్వాహా చేసినట్లు తెలిపారు. హౌస్ ట్యాక్స్ నిధులు దుర్వినియోగంపై గ్రామ కార్యదర్శిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

'స్లో మోటార్ సైకిల్ రైడింగ్'కు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిర్వహించనున్న 'స్లో మోటారు సైకిల్ రైడింగ్' పోటీలకు ఆసక్తి ఉన్నవాళ్లు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 100 మీటర్ల దూరాన్ని ద్విచక్రవాహనంపై కాలు కింద మోపకుండా.. ఎవరైతే తక్కువ వేగంతో లక్ష్యాన్ని చేరుకుంటారో వారిని విజేతలుగా ప్రకటించనున్నట్లు తెలిపారు. రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు బహుమతులుగా అందజేస్తామన్నారు. వివరాలకు 9491074517ను సంప్రదించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రదోష పూజ



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయమైనా సోమవారం ప్రదోషకాల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్, నందీశ్వరుడికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకం చేశారు. విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈవో పెంచల కిషోర్ కర్పూర హారతులతో దర్శించుకున్నారు.

వరసిద్ధునికి వెండి వాహనం



వెండి మూషిక వాహనం అందజేస్తున్న హైదరాబాద్ వాసులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన పంకజ్ కుమార్ రూ.7లక్షల విలువ చేసే వెండి మూషిక వాహనాన్ని సమర్పించారు. దీని బరువు 7కిలోలు. ఏఈఓ రవీంద్రబాబు ఈ వాహనాన్ని స్వీకరించారు. దాతలకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనం గా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాహుకాల పూజల్లో పాల్గొని దోష నివారణ పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

అక్రమ ఇసుక వ్యాపారంపై కూటమి నేతలు కన్నేశారు. భారీగా ఇసుక తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఉచితం మాటున కూటమి నేతలు అక్రమ ఇసుక దందా చేస్తున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా తవ్వకాలు, ఇసుక నిల్వలు కనిపిస్తున్నాయి. అధికారపార్టీ అండతో తెల్ల బంగారాన్ని అమ్మేసుకుంటూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులే అక్రమ వ్యాపారాన్ని పెంచి పోషిస్తున్నారని సొంత పార్టీ నేతలే విమర్శల బాణం విసురుతున్నారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

ఇసుకాసురులకు కాసుల వర్షం

- తవణంపల్లె, వావిల్‌తోటలో జోరుగా ఇసుక తవ్వకాలు
- బెంగుళూరు, తమిళనాడుకు అమ్మకాలు
- రూ.లక్షల్లో కూటమి నేతలకు కాసులు



తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇసుక దోపిడీ

తవణంపల్లె మండలంలోని మైనగుండ్లపల్లె బహుదానదిలో జోరుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా పొక్లెయినర్లతో కుప్పలు పోసి టిప్పర్లల్లో తరలిస్తున్నారు. ఒక్కరోజుకు 5 నుంచి 10 టిప్పర్లల్లో ఇసుక అక్రమంగా పంపించేస్తున్నారు. తమిళనాడులోని తిరుత్తణి, చెన్నై, వేలూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు అడ్డదారిలో లారీలను నడుపుతున్నారు. అక్కడ ఒక టిప్పర్ రూ.60 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు అమ్ముకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యాపారానికి కూటమిలోని బడా నేతలు సహరిస్తున్నారు. వారికి నెలనెలా వాటాలు వెళ్లడంతో ఇసుక అక్రమ వ్యాపారం చేసే కూటమి నేతలకు బడా నేతలు కొండంత అండగా నిలుస్తున్నారు. ఈ బలం వారికి చేయూత నివ్వడంతో మైనగుండ్ల పల్లిలో ఇసుక వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఈ విషయం స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఒక వేళ ఫిర్యాదులు, వార్తా పత్రికల్లో కథనాలొచ్చినా అక్కడ ఏమీ జరగనట్లు ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చుకుంటున్నారు. కథనాలపై శాఖ అధికారులు స్పందించే క్రమంలో ఇసుకాసులకు సమాచారం అందజేసి, రెండు రోజుల పాటు ఇసుక తవ్వకాలు ఆపేయాలని సూచనలు ఇస్తున్నారు. ఆ తర్వాత ఇష్టమొచ్చినట్లు తవ్వకోమని గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రధానంగా మైనింగ్ శాఖ అధికారుల సహకారంతోనే ఈ వ్యాపారం పుంజుకుంటోందని స్థానికులు చెబుతున్నారు. ఇసుక అక్రమ వ్యాపారం కళ్లకు కట్టినట్లు ఫొటోలతో సహా బట్ట బయలవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది

వావిల్‌తోటలో కూడా....

పూతలపట్టు మండలం వావిల్‌తోటలో కూడా అక్రమ ఇసుక వ్యాపారానికి పెట్టింది పేరు. వావిల్‌తోటలోని నొచ్చుపల్లి బహుదానది ప్రాంతంలో జేసీబీలతో ఇసుకను తోడేస్తున్నారు. పగలంతా బంగారు గుట్ట వద్ద అక్రమ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకుని కుప్పలు పోసి పెట్టుకుంటున్నారు. రాత్రికి లారీలు రప్పించి చీకట్లో బెంగళూరుకు సరిహద్దు దాటిస్తున్నారు. లారీకి పైన పట్టకట్టి ఈ అక్రమ వ్యాపారానికి ముసుగు వేస్తున్నారు. ఈ వ్యాపారం కేవలం బడా నేతలకు, అనుచరులుగా ఉన్న నాయకులు, కార్యకర్తలకు వరంలా మారింది. వీరు అక్రమ ఇసుక వ్యాపారంతో లక్షలు దండుకుంటున్నారు.

కష్టపడిన వారిని పక్కన పెట్టి..

కూటమి అధికారం వచ్చాక బడా నాయకులు కొందరు బరితెగిస్తున్నారు. వారి అనుచర వర్గాన్ని అక్రమంగా పెంచి పోషించుకుంటున్నారు. ఇందులో కొత్త ముఖాలకు అవకాశమిస్తున్నారు. అడ్డదారిలో ఆదాయ మార్గాలను కట్టబెడుతున్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి, సీనియర్లకు సంపాదన విషయంలో పిడికెడు ఇసుక తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. ప్రస్తుతం పార్టీలో ఓ వెలుగు వెలుగుతున్న కొందరు బడా నేతలే అన్నీ తామై వ్యవహరిస్తూ.. ఈ ఇసుక దందాకు ఆజ్యం పోస్తున్నారు. దీంతో కొందరు సీనియర్లు, పార్టీకి కష్టపడి పనిచేసిన వాళ్లు సంపాదన లేక విలవిల్లాడిపోతున్నారు.

కార్పొరేషన్‌లో వినతుల స్వీకరణ



బాధితుల అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరు వెంకట్రామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.